# నెలనెలా  వెన్నెల

## అపసరాల రామకృష్ణారావు

బరంపురంలో అప్పుడు ఎగ్జిబిషన్ ఏదో వచ్చింది. ఇలా లోపలికి వెళ్లి వెళ్లగానే జెయింట్ వీల్ కళ్ళబడి నాకు ఒళ్లు తెలిసింది కాదు. అందులో పక్కని ప్రాణ స్నేహితుడు రవిగారు ఉన్నాడాయె. వెంటనే క్యూలో దూరిపోయి రెండు టిక్కెట్లు తీసి ఇటు చూస్తూ 'జెయింట్ వీల్ అందే ఏమిటనుకున్నారు. పది ఏనుగుల పెట్టు ... అలా గోడలా ఉన్నాడు. పూర్ణ చంద్రుడిలా కనిపిస్తున్నాడు. ఇంతింత పిల్లలు పోటీలు పడి ఎక్కుతున్నారు. ఈ పిరికి తనాన్ని ఎగరగొట్టి తీరాలని పించింది. అతను ఎంత వాదిస్తున్న బలిపశువుని తోలుకెళ్ళినట్టు బలవంతం చేసి తొట్టిలో నా పక్కని కూచోపెట్టుకున్నాను. నిలువుగా తిరిగే యీ రంగుల రాట్నం స్టార్టు అయ్యేముందు ఒకటి తర్వాత మరొకటి

● అపసరాల రామకృష్ణారావు

---

# ఇంకా నయం, ఇదా మీ భయం?


పై పైకి వెళిపోతూ ఉండే ప్రాణం ఎక్కడికి పోతుందో ... పదండి .... పదండి అని అతని మొహం చూసి గతుక్కుమన్నాను. 'నాకు అదోలా ఉంది. నేను రాలేను. మీరు ఎక్కండి. నేను కింద ఉంటాను. మీ కోసం చూస్తూ' అన్నాడు, అదోలా. మరేం లేదు, అది ఎక్కడానికి అతనికి భయమని స్పష్టంగా మొహంలో తెలుస్తూనే ఉంది. కోట తొట్టెల్లో మనుషుల్ని నింపి కూర్చున్నాక అడ్డంగా ఊచ అమరుస్తారు. ఆ పద్ధతిలో ఓసారి మా తొట్టె హైయస్టు పాయింట్‌కి వచ్చింది. 'ఇంత ఎత్తున హాయిగా ఎంత బాగుందో చూశారా। పైన నక్షత్రాలు, కింద ఎగ్జిబిషన్‌లో రంగురంగుల లైట్లూ, చుట్టూ ఊళ్లో దీపాలూ...' అంటూ నా ధోరణిలో వాగుతూ జవాబు చెప్పదేమని

పక్కనున్న మనిషిని చూడబోయి ఆ కనీకనబడని వెలుగులో ఏదీ స్పష్టంగా గోచరించక ఇలా చేత్తో మనిషిని పట్టుకు చూశాను. అంతమనిషీ నిలువునా నీరు। ఎంత చల్లగా అయిపోయిందో శరీరం, ఇప్పుడిలా చేత్తో ముట్టుకున్నంత స్పష్టంగా గుర్తుందినాకు ముచ్చెమటలూ పోసేసిన ఆ మనిషి గుండె కొట్టుకుంటూందో లేదో చెప్పడం కష్టం. పిలవగా పిలవగా అతి నీరసంగా పలికేడు. ఈ లొగా జెయింట్ వీల్ స్పీడు అందుకుంది. ఆపమని నేను ఏభాషలో ఎంత గట్టిగా మొరపడితే మాత్రంఎవరికి వినబడుతుంది గనక। గంధపు మానులాంటి ఆమనిషిని వానపాములాంటి నేను గట్టిగా పట్టుకుని, చేతనైనన్ని విధాల ధైర్యం నూరి పోసి, కిందకి ఎలాగ ప్రాణాలతో దింపి, వేడి వేడి టీ యిప్పించి, మళ్ళీ మనిషిని చేసి వాళ్ళింటికి సజీవంగా దిగబెట్టిందాక నా ప్రాణాలు ప్రాణాలుగా లేవు.

డాక్టర్ ఆనందం గారని అక్కడే మెడికల్ కాలేజీలో ఎనాటమీ ప్రొఫెసరు ఒకాయన నాకు ఫ్రండు. అమర్నాటి సాయంకాలం ఏదో మాట మీద మాటొచ్చి, క్లబ్బులో కలుసు కున్నప్పుడు ముందురోజు ముచ్చట, అదే రాక్షసి చక్రం, రవిగారి రియాక్షన్ చెప్పేను. మేమిలా మాట్లాడుకుంటూంటే శశికాంత్ ప్రాణిగ్రాహి అని ఓ సైకియాట్రిస్టు కలిశాడు, ఆ డిస్కషన్‌తో. తర్వాత ఆ సబ్జెక్టుమీద నేను చేసిన స్టడీలో, చాలా విషయాలు బయట పడ్డాయి.

రవిగారి మనో వైకల్యానికి కారణం ఎత్తు ప్రదేశాలంటే బయపడే (Acro-Phobia) తరగతికి చెంది ఉండవచ్చునట. ఇది ఎందుకు వచ్చిందనీ, ఇది ఎలా పోతుందనీ అడక్కండి. కొందరికి కొన్ని కొన్ని అంటే భయం. ప్రీతి లాగే భీతికూడా జీవలక్షణం .... అని ప్రాణిగ్రాహి ఇంకా ఏదో చెబుతూతే నా మటుకు నేను నా ప్రత్యేక ప్రపంచంలోకి జారుకున్నాను.

... అవును. భయం పలురకాలు. ఎవరిభయం వాళ్ళకి ప్రాణం పోకడగానే కనిపిస్తుంది. చిన్నప్పుడే మొగుడు పోయిన ఎదురింటి హేమాంగికే కాదు. పోస్టాఫీసులొ పనిచేస్తున్న ఇద్దరు పిల్లల తల్లి ఇందిరమ్మకి కూడా కడుపు దింపుకోడానికి పుచ్చుకున్న మాత్రలు పని చేస్తాయో లేదో అని భయం, ఎక్కడెక్కడి మాత్రలూతెచ్చి పెళ్లాంచేత మింగిస్తాడుకాని మరిపిల్లలు పుట్టకుండా తొడ పక్క చిన్న కుటుంబ నియంత్రణపు కత్తిగాటు పెట్టించుకోడానికి ఇందిర మొగుడుకి బ్రహ్మాండమైన భయం. కోడలు ఆఫీసుకి వెళ్ళిపోతే పోనీ పిల్లల్నయినా తియ్యాలా వేలేసి ముట్టుకోదు ఇందిర అత్తగారు. ఆవిడ్ని పొమ్మంటే ఆ ఆస్తి కాస్తా ఎక్కడ ఆడపడుచుపేర రాసేస్తుందో అని వాళ్ళ భయం. 'పోనీ ఒక్కడే కొడుకు కదుటమ్మా, ఆస్తి రాసివ్వరాదూ ?' అంటే, చచ్చిపోయాక కూడా తద్దినాలు పెట్టించుకుని తినాలని కోరిక గల ఆ ముసలావిడకి ఆ ఆస్తి కాస్తా చేజిక్కిస్తే బతికుండగానే తిండి పెట్టరేమో అని భయం.



వేరే ఓ కుటుంబాన్ని తీసుకోడం దేనికి, ఎక్కడ లేదు. భయం! పెళ్లి కాకపోతే ఇక అవదేమో అని భయం అయి అయిదారేళ్లు దాటితే అయ్యో ఇక పిల్లలు పుట్టరేమో అని భయం. వరసగా పుట్టుకొస్తే దీన్ని ఎక్కడ ఎలా ఆపడం అని భయం. ఈ కరువు రోజుల్లో వీళ్ళని పెంచగలమా అని భయం........ తీరా ఆరోగ్యంగా పెరిగి పెద్దవాళ్లై వాళ్ల బతుకులు వాళ్ళు బతుకుతూవుంటే, పెద్ద కాలంలో మనల్ని తిన్నగా చూస్తారా అని భయం. ఒకవేళ చూస్తే 'ఈ ప్రేమ యిలా ఎల్లకాలం ఉంటుందా' అని భయం. అసలు యింతింత పెద్ద విషయాలు దేనికి ఆకాశంమీద రిబ్బను ప్రమాణంగల ఓ మబ్బు పీలిక కనపడనియ్యండి వీధిలోకి అడుగెట్టిన కొందరు ఇంట్లోకి వెళ్లిపోతారు ఆరోజు ప్రోగ్రామ్ మానుకుని. ఏమో ఎవరు చెప్పగలరు, నాలుగు చినుకులుగా మొదలెట్టి గాలివానగా మారొచ్చు. గొడుగు పట్టిగెడితేమాత్రం ఆగుతుందా చిత్తుగా తడిసిపోవచ్చు. బాగా జలుబు చేసిందంటే, విషజ్వరంవచ్చి రోగలక్షణాలు విజృంభిస్తే, ఎంతలో టుప్పుమని పోవాలి నీటిబుడగలాంటి యీ పాడు ప్రాణం,! అని వీళ్ల భయం.

ఇలా నా ఆలోచనలు తాడూ బొంగరం లేకుండా వెళిపోతూంటే ఆనందం ఆపు చేసి, కోప్పడి, పైకి కక్కించాడు.

ఆందోళనా, బెంగా, నిరాశా, నిస్పృహ బితుకూ ఇంకా చెప్పాలంటే గజగజా దడదడా ఇలాంటి వాటన్నిటినీ కలిపి ఏకంగా భయంపేరుపెట్టి ఆలోచిస్తున్నానట నేను.

'ఇవన్నీ భయాలు అయినా కాకపోయినా ఇప్పుడు మా రవిగారి గురించి మీరు చెప్పిన ప్రత్యేక రకమైన భయాలు కొన్నున్నాయి, వాటికి వేరే పేర్లుకూడా ఉండడం తమాషా! అంటూ పాణిగ్రాహి ఆ మర్నాడు ఆ భయాల జాబితా నాకు అందజేశాడు. పెళ్ళాంమంటేనో, పెద్దపులి అంటేనో, అత్తగారంటేనో, ఆఫీసరంటేనో చేసిన పాపంఅంటేనో, తీరని రుణం అంటేనో, శక్తులంటేనో, భక్త సమాజాలంటేనో మనుష్యులు భయపడ్డం సహజం. అతను ఇచ్చిన లిస్టులో ఇందులో ఏ ఒక్కటీ లేకపోవడం ఎంత ఆశ్చర్యకరం!

మొన్న మొన్నటిదాకా రాత్రిఒక్కణ్ణీ పడుకోడానికి చచ్చే భయం ఉండేదినాకు. ఆ గదిలో ఏడాది చంటిపిల్లని ఉయ్యాల్లో పడుకోపెట్టినా సరే కొండంత సాయం

అనిపించి ఒళ్ళు తెలీకుండా నిద్రపట్టేసింది. దీనికి చీకటి భయం (NYCTO PHOBIA) అంటారుట. కొందరికి ఆకాశంలో గుడగుడమంటే చాలు గుండె గుభేలుమంటుంది. అది పిడుగుల భయం (CERAUNO PHOBIA). మెరుపు అంటే ఎంతో వెరపు కొందరికి (ASTRA PHOBIA). పాముల భయం(OPHIDIO PHOBIA). కుక్కల భయం (CYNO PHOBIA). పిల్లుల భయం ( AILURO PHOBIA ) సర్వ సామాన్యం. కొందరికి నీటి భయం (AQUA PHOBIA) అయితే, మరి కొందరికి నిప్పు అంటే భయం (PYRO PHOBIA). మా అక్కయ్య మునుపు రైలెక్కేదికాదు. 'బాబోయ్ ఆ రష్‌లో ఎక్కడ నలిగి ఊపిరాడకుండా చచ్చిపోతానో!' అనేది. దీన్ని ఇరుకు స్థలాల బెరుకు (CLAUSTRO PHOBIA) అంటారుట. ఈ మధ్య ఎమర్జన్సీ ధర్మమా అని రైళ్ళలో దాగా జాగా ఉంటోంది. 'అమ్మనాయనోయ్ - అంత పెద్ద పెట్టెలో ఒక్కర్తినీ కూచుని ప్రయాణం చెయ్యగలనా!' అంటుంది మళ్ళీ మా అక్కయ్యే! దీన్ని ఖాళీజాగాల కంగాళీ (AGORA PHOBIA) అని పిల్చుకుంటారట. పుట్టుకతోనే వృద్ధులైన కొందరికి కొత్త పద్ధతి ఏదైనా గొప్ప భయం (NEO PHOBIA). కొందరికి పైనుంచి వచ్చింది ఏదైనా సరే గుండెల్లోంచి వణుకు (XENO PHOBIA). ఈలిస్టు కంఠతాపెట్టాలి కాబోలు దేవుడా! అని వెర్రిభయం పట్టుకుంది నాకు. దీని పేరేమిటో మరి?!




అజ్ఞానం అనేది భయానికి మూల కారణం కాబట్టి మనదేశంలోనే కాబోలు యీ వెర్రి మొర్రి భయాలు అని మనం భయపడనక్కరలేదు. మనుషుల మూఢ నమ్మకాలు చల్లగా ఉండాలిగాని ప్రపంచమంతా భయం మయం. మాటవరసకి పదమూడో అంకె-పాపం అన్ని అంకెల లాంటిదే అదీ-కనబడితే చాలు ఎక్కడేనా కళ్ళు మూసేసుకుంటారు. పీకపోయినా పదమూడో తారీకున ప్రయాణం పెట్టుకోరు. హోటల్లో పదమూడో నెంబరు గది అలా ఖాళీగా ఏడవవలసిందే! ఈ బాధ ఎందుకని కొందరు 12 తర్వాత 14 నెంబరు వేసుకుంటారు గదికి. ఆ మధ్య-అంటే పది పన్నెండేళ్ల క్రిందట మన ఇండియన్ ఎయిర్‌లైన్స్‌వైకౌంట్ ఒకటి కూలిపోయింది. అప్పటికి మన కున్న విమానాల్లో అలాంటివి, అది పద




మూడోదిట. అందులో పదముగ్గురు ప్రయాణీకులట. అందరూ చావక చస్తారా మరి! అంటారు. అయితే ఓ ప్రశ్న. రాజకపూర్ ఫిలిమ్స్ సంస్థ 'బాబీ' వారి పదమూడో చిత్రం. కోట్లకి కోట్లే దోచేసిందేం మరి? ఇంతకీ పదమూడో నెంబరంటే భయానికి కూడా TRISKA-DEKAI PHOBIA అనే పేరుందిసుమండీ!

ఫోబియా, ఎప్పుడు పోతావయా ।

అందుకే మన భర్తృహరిగారు.

భోగే రోగభయం, కులేచ్యుతి భయం,
విత్తే నృపాలాద్భయం
మానే దైన్యభయం, బలేరిపుభయం,
రూపే జరాయా భయం
శాస్త్రేవాదభయం, గుణేఖల భయం,
కాయే కృతాంతాద్భయం
సర్వం వస్తుభయాన్వితం భువినృణాం,
వైరాగ్యమేవాభయం ।

అని షోకైన శ్లోక రూపాన శోకించారు 'ప్రపంచంలో మనుషులికి అన్ని విషయాలూ భయంకరంగానే కనిపిస్తాయి. వైరాగ్యమొక్కటే భయం లేనిది' అని పూరిచేస్తూ. కాని యిలాంటి ఏ భయమూ లేనివాళ్లని చూసే కాబోలు 'వైరాగులొస్తున్నారు, చెంబూ తప్పేలా జాగ్రత్త పెట్టుకోండి' అని భయపెడుతూ ఉంటారు, అనుభవజ్ఞులు.

బతుకులు బతుక్కూమనిపించే యీ భయానక ప్రపంచంలో మినుకూమినుకూ వెలిగే ఆశ ఒక్కటే. అదే మనకి అభయ ముద్ర. మన కొక్కరికే కాదు, ప్రతీ ఒక్కరికీ ఏదో రకం భయం ఉండనే ఉంది.